
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు 5

మంగళవారం 25 ఫిబ్రవరి 2025



చార్జ్ మెమోలు జారీ చేయండి

కలెక్టర్ రంజిత్ బాషా



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా అధికారుల పేర్లు మూడుసార్లకు మించి ఎట్ టూ వ్యూ కేసులలో వస్తే సంబంధిత అధికారికి చార్జ్‌మెమోలు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ఉన్న అర్జీలపై స్పందించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్వోను కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ అంశంపై డివిజన్ లెవెల్ స్థాయిలో వారానికి రెండుసార్లు సమీక్షలు నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి మండల సర్వేయర్, కోసిగి మండలంలో 44 అర్జీలు వస్తే అందులో నాలుగు మాత్రమే పరిష్కరించి 90 శాతం పెండింగ్‌లో ఉంచడం ఏంటన్నారు. దేవనకొండ 53 శాతం, మండల సర్వేయర్ పెద్దకడుబూరు మండలంలో 50 శాతం, హొళగుంద, ఎమ్మిగనూరు మండలాల్లో 40 శాతం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి వచ్చిన అర్జీలలో పరిష్కారం చేసిన వాటిని ఆడిట్ సమయంలో కర్నూలు డివిజన్‌లో 1731 పెండింగ్‌లో ఉన్నాయని, ఆదోని డివిజన్‌లో 1075, పత్తికొండ డివిజన్‌లో 730 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కర్నూలు రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వైపు ఆధునికీకరణ పనులు

అమృత్ భారత్‌గా కర్నూలు స్టేషన్..?

అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ (రీ మోడలింగ్) పనులు చేపట్టారు. రైల్వే స్టేషన్‌ను మరింత ఆధునికీకరించి, వెంకటరమణ కాలనీ వైపు రెండో ద్వారం ఏర్పాటు చేస్తే తమ కష్టాలు తీరుతాయని రైల్వే ప్రయాణికులు ఆశించారు. ఏడాదిన్నర దాటినా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. మరో ఏడాదైనా పూర్తయ్యేలా లేదు. రూ.42.62 కోట్లతో చేపట్టిన కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల తీరుపై ఆంధ్రజ్యోతి కథనం.

- ముందుకుసాగని పనులు
- రూ.42.62 కోట్లతో పునరుద్ధరణ పనులు
- 2023 ఆగస్టు 5న వర్చువల్ ద్వారా ప్రధాని మోదీ శంకుస్థాపన
- ఏడాదిన్నర కావస్తున్నా పనుల్లో పురోగతి అంతంతే
- మూడు నెలల్లో పూర్తి చేస్తామంటున్న రైల్వే ఇంజనీర్లు
- ఇది సాధ్యమేనా..? అంటున్న రైల్వే ప్రయాణికులు

కర్నూలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే స్టేషన్‌కు 120 ఏళ్ల చరిత్ర ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వమే 1905లో స్టేషన్ ప్రయాణికుల వినియోగంలోకి వచ్చింది. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి 2013-14లో కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా ఉన్నప్పుడు కర్నూలు స్టేషన్‌ను సిటీ రైల్వే స్టేషన్‌గా మార్చారు. దీంతో రైల్వే శాఖలో మంచి గుర్తింపు వచ్చింది. 2019లో రూ.28 కోట్లతో స్టేషన్ రూపురేఖలు మార్చారు. స్టేషన్ ముఖద్వారం ఆధునికీకరణ, స్టేషన్‌లో పచ్చదనం, వాహనాల పార్కింగ్, ప్లాట్ ఫారం పునరుద్ధరణ, టికెట్ కౌంటర్, ప్రయాణీలకు విశ్రాంతి గదులు, స్టేషన్ ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటులాంటి వివిధ పనులు చేపట్టారు. 120 ఏళ్ల స్టేషన్ రూపురేఖలు మారిపోయాయి. ప్రతి రోజూ 12-15 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. నెలకు సగటు ఆదాయం రూ.2.10 కోట్లు ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద 2023లో శ్రీకారం చుట్టింది. రూ.42.6 కోట్లతో చేపట్టే పునరుద్ధరణ పనులకు అదే ఏడాది ఆగస్టు 5న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి జాతీయ స్థాయి అంగులతో స్టేషన్‌ను తీర్చిదిద్దుతామన్నారు. నగరం అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా ప్రయాణికులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా పడమర వైపు రెండో ద్వారా, టికెట్ కౌంటర్.. వంటి పనులు చేపట్టారు. అయితే.. పనుల్లో జాప్యం కారణంగా ప్రయాణికులు అసౌకార్యానికి గురవుతున్నారు.

ఇంకెన్నాళ్లు..?:

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ మోడలింగ్ పనులు ఆలస్యంగా మొదలయ్యాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. స్టేషన్ పడమర దిశగా వెంకటరమణ కాలనీ వైపు రెండో ప్రధాన ప్రవేశ ద్వారం నిర్మాణం. పార్కింగ్, రైల్వే బుకింగ్ కౌంటర్, తూర్పు వైపున ప్రస్తుత ప్రధాన ద్వారం ముఖచిత్రం పూర్తిస్థాయిలో నవీనీకరణ, సుందరీకరణ, తూర్పు, పడమర ద్వారాలు కలుపుతూ ఫుట్ ఓవర్ బిడ్జి నిర్మాణం, ప్రమాణీకులు వివిధ ప్లాట్‌ఫారంలో దిగేందుకు వీలుగా లిఫ్టులు, ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో అవసరం లేని కట్టడాలు తొలగించి సర్క్యులేటింగ్ ప్రాంతం, అప్‌గ్రేడ్ చేసిన పార్కింగ్ స్థలాలు, దివ్యాంగులకు అనుకూలంగా మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడం ద్వారా పర్యావరణ అనుకూల సదుపాయాలు, ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు, ట్రాఫిక్ సర్క్యులేషన్, ఇంటర్-మోడల్ ఇంటిగ్రేషన్.. వంటి పనులు ఆధునిక ఆర్కిటెక్చర్, అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే.. ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. 12 నెలల్లో పూర్తి చేస్తామని శంకుస్థాపన సమయంలో రైల్వే అధికారులు చెప్పారని, ఇప్పటికే ఏడాదిన్నర కావస్తున్నా 25-30 శాతం పనులు జరగలేదని కర్నూలు నగరానికి చెందిన రైల్వే ప్రయాణికుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటకరణ కాలనీ వైపు టికెట్ కౌంటర్ భవనం నిర్మాణం పనులు ఒక్కటే జరుగుతున్నాయి. ఇతర పనులు మొదలు కాలేదు.

మిగతా 7వ పేజీలో



వెంకటరమణ కాలనీ వైపు రెండో ద్వారం ఏర్పాటులో భాగంగా టికెట్ కౌంటర్ భవన నిర్మాణం పనులు



పూల పల్లకిలో దేవ దేవుడు

శ్రీశైలం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు సోమవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు, జపాలు, పారాయణాలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, చండీహోమం, రుద్రహోమం, జరిపించారు.

నేడు గజవాహన సేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి గజవాహనసేవ నిర్వహించనున్నారు.

పూల పల్లకిలో స్వామి, అమ్మవార్ల విహారం

పుష్పప్రియుడు మల్లన్న దేవేరి భ్రామరీతో కలసి పూలపల్లకిలో విహరించారు. సోమవారం రాత్రి గ్రామోత్సవానికి ముందు ఉభయ దేవాలయ అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ముస్తాబైన ఆదిదంపతుల ఉత్సవ విగ్రహాలను రాజగోపురం గుండా ఆలయం వెలుపలకు తోడ్కొనివచ్చి పుష్పపల్లకీలో కొలువుదీర్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు సాగి, అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం మీదుగా ఆలయ రాజగోపురం చేరుకుంది. ఉత్సవం ఎదుట

భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ

జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు, తప్పెట్లు, భజంత్రీలు, మేళతాళాలు, శంఖనాదాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి, అమ్మవార్ల పుష్పపల్లకీలో ఎర్రబంతి, పసుపుబంతి, తెల్ల చేమంతి, పసుపు చేమంతి, కనకాంబరాలు, డచ్ రోస్, అశోక పత్రాలు, కాగడాలు, గ్లాడియేలస్, అస్పెర్ గ్రాస్, జబ్రా, కార్నేషన్, ఆర్కిడ్స్, నందివర్ధనం, గరుడవర్ధనం వంటి సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, ఆలయ అర్చకులు, అశేష భక్త జనం పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత లడ్డు పంపిణీ

శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఉచిత లడ్డు పంపిణీ సోమవారం ప్రారంభించారు. ఈ నెల 10న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రులు సత్యప్రసాద్, అనిత, జనార్దన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఆదేశించారని పేర్కొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



కోలాట నృత్యం



నృత్యం చేస్తున్న కళాకారులు



ఆకట్టుకుంటున్న వేషధారణ



శ్రీశైలానికి చేరుకుంటున్న భక్తులు



ప్రత్యేక వేషధారణలో మహిళలు



భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ

స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో అడ్మిషన్లు

ప్రారంభించిన సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్



క్యాన్సర్ హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ అడ్మిషన్ సేవలను కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కే చిట్టినరసమ్మ, క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.సీఎస్ కృష్ణప్రకాష్ ప్రారంభించారు. సోమవారం క్యాన్సర్ హాస్పిటల్‌లో అడ్మిషన్ అయిన రోగులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు అత్యంత ఖరీదైన పరికరాలు వచ్చాయని అన్నారు. రూ.36 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలేటర్ రూ.7 కోట్ల విలువైన సిటీ సిములేటర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బొంబాయి, ఏఈఆర్‌బీ నుంచి అనుమతులు రాగానే లీనియర్ యాక్సిలేటర్ సేవలు ప్రారంభిస్తామన్నారు. స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ మాట్లాడుతూ 50 మంది అడ్మిషన్ రోగులను కొత్త భవనంలోకి చేర్చామన్నారు. దీని వల్ల రోగులకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళిని, క్యాన్సర్ వైద్య నిపుణులు డా. ఉమామహేశ్వరరెడ్డి, డా.శివప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ డా. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

జాయింట్ కలెక్టర్ నవ్య



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ డెలివరీ బాయ్‌లు గ్యాస్ వినియోగదారుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని జేసీ డా.బి.నవ్య గ్యాస్ ఏజెన్సీ యజమాన్యాలను హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో గ్యాస్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఏ గ్యాస్ వినియోగదారుల నుంచి డీలర్ అదనంగా వసూలు చేయరాదన్నారు. దీపం-1 పథకానికి అర్హత కలిగి ఉండి గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం చేయని వారిని ఈకేవైసీ చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో రాజా రఘువీర, ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి, ఆయిల్ కంపెనీ కోఆర్డినేటర్ యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్

ఈ నెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

7





విద్యుద్దీపాలంకరణలో ఓంకార క్షేత్రం

నల్లమలలో శివనామం

- పలు క్షేత్రాలు మహా శివరాత్రికి సిద్ధం
- శ్రీశైలానికి పాదయాత్రగా లక్షలాది భక్తులు

మహానందిలో ధ్వజారోహణం

- ప్రారంభమైన మహా శివరాత్రి ఉత్సవాలు
- మయూర వాహనంపై మహానందీశ్వరుడు



మహానందిలో మయూర వాహనంపై విహరిస్తున్న మహానందీశ్వరుడు

మహానంది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, త్రిశూల చండీశ్వరార్చన, దీక్షా కంకణధారణలను నిర్వహించారు మధ్యాహ్నం అంకురార్పణ, కలశ స్థాపన, అఖండ దీప ప్రతిష్ట నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం సకల దేవతలను ఆహ్వానించేందుకు ఆలయం ప్రాంగణంలోని ధ్వజ స్తంభానికి వేదోక్తంగా సోమవారం రాత్రి ధ్వజారోహణం చేశారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాత్రి మయూర వాహనంపై మహానందీశ్వరుడ్ని ఊరేగించారు.

భూకైలాసం ..రుద్రకోటేశ్వరం



భూలోక కైలాసంగా విరాజిల్లుతున్న రుద్రకోటేశ్వర క్షేత్రం

ఆత్మకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నల్లమలలో రుద్రాణిసహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లు కొలువుదీరిన రుద్రకోటేశ్వర క్షేత్రం భూలోక కైలాసంగా విరాజిల్లుతోంది. 1938లో చందా తిరుపంరెడ్డి అనే భక్తుడి చొరవతో నల్లమలలో రుద్రకోటేశ్వరాలయం జీర్ణోద్ధరణకు నోచుకుంది. ఆనాటి నుంచి నేటి వరకు నిరంతరం క్షేత్రంలో పూజలు కొనసాగుతున్నాయి. ప్రతి సోమవారం, కార్తీకమాసంతో పాటు కార్తీకపౌర్ణమి, మహాశివరాత్రి వంటి ప్రత్యేక పర్వదినాల్లో భక్తులు విశేషంగా తరలివస్తారు. ఈనెల 26వ తేదిన మహాశివరాత్రి జాగరణ సందర్భంగా క్షేత్రానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఆత్మకూరు పట్టణం నుంచి 5 కిలోమీటర్లు నల్లకాల్వ గ్రామానికి చేరుకోవాలి. అక్కడి నుంచి 15 కిలోమీటర్ల మేర అటవీమార్గంలో ప్రయాణిస్తే.. రుద్రకోటేశ్వరక్షేత్రానికి చేరుకోవచ్చు. మార్గమధ్యంలో మూడు వాగులు అడ్డుపడతాయి. అయితే ట్రాక్టర్ల ద్వారా వాటిని దాటేందుకు అవకాశం వుంటుంది. క్షేత్రానికి వెళ్లే భక్తులు ఖచ్చితంగా అటవీ అధికారుల అనుమతి తీసుకోవాలి.

అడుగులన్నీ శ్రీగిరి వైపే..

- వెంకటాపురానికి పోటెత్తిన భక్తులు
- తాగు నీటి వసతి కల్పించాలని భక్తుల వినతి

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం శ్రీశైలానికి తరలి వచ్చే భక్తులతో నల్లమల దారులన్నీ శ్రీగిరి వైపే సాగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా మల్లన్నను దర్శించుకునేందుకు అనంతపురం, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు, డోన్, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి పాదయాత్రికులు లక్షలాదిగా తరలివస్తున్నారు. ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి వాహనాల్లో చేరుకుని నల్లమలలో 42 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగిస్తున్నారు. వెంకటాపురం నుంచి గోసాయి కట్ట, నాగలూటి, పెచ్చెరువు, భీముని కొలను, కైలాస ద్వారం ద్వారా మల్లన్న సన్నిధికి చేరుకుంటున్నారు.



వెంకటాపురం శివాలయం వద్ద పోటెత్తిన భక్తులు

వెంకటాపురానికి పోటెత్తిన భక్తులు

మహాశివరాత్రి ఇక రెండు రోజులే ఉండటంతో ఆదివారం పాదయాత్రగా తరలివెళ్ళే భక్తులతో వెంకటాపురం పోటెత్తింది. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల్లోని శివస్వాములు తమ ఇరుముడులు ధరించి పాదయాత్రగా, వివిధ వాహనాలలో వెంకటాపురం గ్రామం చేరుకుని అక్కడి నుండి పాదయాత్ర సాగిస్తున్నారు. మండలంలోని ఎస్ఆర్‌బీసీ, అమలాపురం, కృష్ణాపురం గ్రామ శివార్లలో, వెంకటాపురం గ్రామంలో, నల్లమలలోని నాగలూటి, పెచ్చెరువులో పలువురు దాతలు అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. కృష్ణాపురం గ్రామ శివార్లలో నంద్యాల మండలం బ్రాహ్మణ పల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో, వెంకటాపురం గ్రామంలో రెండు చోట్ల గ్రామస్థుల ఆధ్వర్యంలో, నల్లమలలోని నాగలూటిలో బండి ఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం గ్రామస్థులు, పెచ్చెరువులో పలువురి ఆధ్వర్యంలో అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేసి భక్తుల సేవలో తరిస్తున్నారు. పాదయాత్రలో శివస్వాములకు పలువురు దాతులు దాహం తీరుస్తున్నారు.



నల్లమల అరణ్యంలో పాదయాత్రగా వెళ్తున్న శివభక్తులు

నల్లమలలో ఓంకార నాదం

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని ఓంకార క్షేత్రంలో శివనామం ప్రతిధ్వనించింది. అలాగే విష్ణనంది, శివనంది, గుండ్ల బ్రహ్మేశ్వరం క్షేత్రాలకు శివరాత్రి సందర్భంగా భక్తులు హాజరువుతారు.

ఓంకారం.: ఓం అనే ప్రణవనాదం వినిపించటంతో ఓంకార క్షేత్రం వెలసిందని నానుడి ఉంది. ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో ఓం శబ్దం అంతర్లీనం అయిపోయిందని అంటారు. ఈ క్షేత్రాన్ని ఎందరో మహిమాన్వితులైన సిద్ధులు ప్రతిష్ఠించినందు వల్ల ఇక్కడి దేవుడికి సిద్ధేశ్వరస్వామి అనే పేరు వచ్చిందని నమ్మకం. ఈ క్షేత్రం పచ్చని చెట్లు, తీగల పొదల మధ్య, పక్షుల కిలకిల రావాలతో అలరారుతూ ఆకట్టుకుంటుంది. నంద్యాల, ఆత్మకూరు రహదారిలోని బండిఆత్మకూరు, శింగవరం గ్రామాల మీదుగా, అలాగే ఏ కోడూరు, ఈర్నపాడు గ్రామాల మీదుగా 12 కిమీ ప్రయాణించి భక్తులు ఈ క్షేత్రాన్ని చేరుకోవచ్చు.

శివనంది..: ఈ క్షేత్రం మండలంలోని కడమలకాల్వ గ్రామం చెంతనే ఉంటుంది. ఆరో శతాబ్ద కాలంలో రెండో పులకేశి అనే రాజు కాలంలో ఈ ఆలయం నిర్మాణమవైందని అక్కడి శాసనాలనుబట్టి తెలుస్తోంది. ఆలయ ఆవరణంలో 108 ఉప గర్భాలయాల్లో కొన్ని నేటికీ ఉండటం తార్కాణం. ఈ క్షేత్రాన్ని నంద్యాల నుంచి కొత్తపల్లె, వెంగళరెడ్డిపేట గ్రామాల మీదుగా 10 కిమీ ప్రయాణించి చేరుకోవచ్చు.

విష్ణనంది (కృష్ణనంది)..: నల్లమలలోని శివాలయాలన్నీ శివనామంతో వెలిస్తే ఈ క్షేత్రం మాత్రం విష్ణునామంతో వెలిసింది. ఇక్కడ ఋుగ్వేద నవగ్రహాలు, పాలరాతి నంది విగ్రహం ప్రత్యేకత. పాలరాతి నంది విగ్రహాన్ని అచ్చం ఎద్దు అనుకుని పెద్దపులి పంజా విసిరిందని అంటారు. విష్ణువు శాప విమోచనం కోసం శివుణ్ణి ఆరాధించడంతో ఈ క్షేత్రం విష్ణునంది (కృష్ణనంది)గా పేరు గాంచిందని అంటారు. ఈ క్షేత్రాన్ని నంద్యాల నుంచి కొత్తపల్లె, బీ కోడూరు, కడమలకాల్వల మీదుగా 16 కిమీ ప్రయాణించి చేరుకోవచ్చు. దర్శించవచ్చు.

ఓంకారంలో నేటి నుంచి ఉత్సవాలు

మహా శివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. బండిఆత్మకూరు మండలంలోని ఓంకార క్షేత్రంలో మంగళవారం నుంచి 28వ తేదీ వరకు శివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో నాగప్రసాద్ సోమవారం తెలిపారు. మంగళవారం రాత్రి బండిఆత్మకూరు గ్రామంలో గంగా ఉమా సమేత సిద్ధేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి 26వ తేది వేకువజామున స్వామి వార్ల పల్లకి శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల మీదుగా ఓంకారం చేరుకుంటుంది. అదే రోజు మధ్యాహ్నం యజ్ఞయాగాదులు నిర్వహించి స్వామివార్ల కల్యాణానికి దేవతలను ఆహ్వానిస్తారు. అర్ధరాత్రి లింగోద్భవ పూజలు, అనంతరం 27 తెల్లవారుజామున స్వామి వార్ల కల్యాణం ఉంటుందని ఈవో తెలిపారు. సాయంత్రం నంది వాహనంపై స్వామి వార్ల క్షేత్రోత్సవం, 28వ తేదీ సాయంత్రం రథోత్సవం, రాత్రికి పుష్కరిణిలో వసంతోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 1వ తేది ఉదయాన్నే స్వామి వార్లకు పూజలు చేసి తిరిగి పల్లకిలో బండిఆత్మకూరుకు చేర్చటంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. అలాగే శివనంది క్షేత్రంలో ఈనెల, 26, 27 తేదీలలో స్వామి వార్ల ఉత్సవాలు జరుగుతాయని, ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఈవో తెలిపారు. విష్ణనంది క్షేత్రంలో ఈ నెల 25నుంచి 28వ తేదీ వరకు స్వామివార్ల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు.

పూజలు అందుకుంటున్న వీరభద్రుడు



వీరభద్రుడి ఆలయం

ఆత్మకూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రక్షక దేవతామూర్తుల్లో ఒకరు నాగలూటి వీరభద్ర స్వామి. శ్రీశైల క్షేత్రానికి కాలినడక వెళ్లే భక్తులు ఖచ్చితంగా నాగలూటి వీరభద్రస్వామిని దర్శించిన తర్వాత మల్లన్న సన్నిధికి చేరుకుంటున్నారు. శ్రీశైల క్షేత్రానికి వాయువ్య దిశలో వున్న మెట్లమార్గానికి రక్షకుడిగా ఉన్న వీరభద్రుడి ఆలయాన్ని రెడ్డిరాజుల కాలంలో నిర్మించారని అంటారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు వీరభద్రుడిని ఆరాధిస్తారు.

నాగలూటి క్షేత్రంలో కాలగర్భంలో కలుస్తున్న శిల్ప సంపద : నాగలూటి క్షేత్రంలో అరుదైన శిల్పసంపద కొలువుతీరింది. క్షేత్ర పరిధిలోని గర్భాలయంతో పాటు ద్వారమంటపం, పలు ఉప ఆలయాలపై రూపొందించిన శిల్పాలు ఎంతో ఆకర్షణగా నిలుస్తాయి. అదేవిధంగా క్షేత్రంలో మంచినీళ్ల కొలను ఒక అద్భుతమైన రాతి కట్టడం. ఆత్మకూరు పట్టణం నుంచి 12కిమీల దూరంలో వున్న బైర్లూటి చెంచుగూడేనికి చేరుకొని, అక్కడి నుంచి 2కిమీల దూరంలో వున్న నాగలూటి గూడేనికి చేరుకోవచ్చు. అక్కడికి ఆరు కిలోమీటర్ల దూరంలో నాగలూటి క్షేత్రం ఉంది.

నేటి నుంచి యాగంటి బ్రహ్మోత్సవాలు



యాగంటి గోపురం

బనగానపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమల్ల కొండల్లో స్వయం భూగా వెలసిన యాగంటి ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. 25న ఉదయం 5 గంటలకు యాగంటి ఆలయంలో మహాన్యాసక రుద్రాభిషేకం, కుంకుమార్చనసహస్ర నామావళి, ఉదయం 8 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలు ఉంటాయన్నారు. మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి రేలారేలారే కార్యక్రమంతో పాటు బీరం పుల్లారెడ్డి, వనజాకుమారి అనంతపురం వారిచే చింతామణి నాటకం ప్రదర్శించనున్నట్లు వివరించారు. అదేరోజు రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమం, అనంతరం తెల్లవారుజామున ఉమామహేశ్వరస్వామి కల్యాణం రంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న నందికోల ఉత్సవాలు, 28న రథోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మార్చి 1 శనివారం శివదీక్ష విరమణ, పూర్ణాహుతి నాగవల్లి, వసంతోత్సవాలు, తెప్పోత్సవం, ధ్వజావరోహణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 24 ఆంధ్రజ్యోతి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శ్రీశైలానికి భక్తులు పోటెత్తుతున్నారు. భక్తుల రాక పెరగడంతో రహదారి మొత్తం భక్తులతో నిండిపోయింది. ముఖ్యంగా వెంకటాపురం నుంచి పాదయాత్రగా భక్తుల దండు కదలివస్తోంది. అలాగే ఇటు దోర్నాల, అటు తెలంగాణ రాష్ట్రం నుంచి వందలాది వాహనాలు భక్తులతో చేరుకుంటున్నాయి. వెంకటాపురం నుంచి నల్లమల అడవిలో నాగలూటి, పెచ్చెర్వు, భీముని కొలను దాటి కైలాసద్వారం చేరుతున్నారు. అటునుంచి ప్రధాన రహదారిని చేరుకుని హటకేశ్వరం, పాలధార, పంచధార, సాక్షిగణపతిని దర్శించుకుంటున్నారు. ఆపై ప్రధాన రహదారి వెంట నడుస్తూ మెట్ల మార్గం గుండా కిందకు దిగుతున్నారు. భక్తుల రాక పెరగడంతో చలువ పందిళ్లు, సత్రాలకు చెందిన గదులు, ప్రాంగణాలు భక్తులతో నిండిపోయాయి. భక్తులు మల్లన్నస్వామి ఉత్సవాలను తిలకిస్తూ గడుపుతున్నారు. భజనలు చేస్తూ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వీక్షిస్తూ భక్తులు గడుపుతున్నారు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీశైల క్షేత్రం

సీఎం దృష్టికి దేవస్థానం సమస్యలు: మంత్రి ఆనం

సున్నిపెంట, 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలో చాలా కాలంగా పెండింగులో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గవర్నర్ అబ్దుల్ నజీరుకు స్వాగతం పలికేందుకు వచ్చిన మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చాలా కాలంగా శ్రీశైలంలో భూ వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. శ్రీశైలం అభివృద్ధిలో భాగమైన మాసర్ ప్లాన్ రూపకల్పనపై ప్రభుత్వం ప్రతేక దృష్టి సారించిందని తెలిపారు. క్షేత్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన మర్గదర్శకాలు రూపొందించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంత్రి స్వయంగా పరిశీలించారు. క్యూలైన్ల వద్దకు వెళ్లి ఏర్పాట్లు ఎలా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా భక్తులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి అధికారులకు ఆదేశాలిచ్చారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఉన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న మంత్రి

అమృత్ భారత్‌గా కర్నూలు స్టేషన్..?

మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చేనా..?



వెంకటరమణ కాలనీ వైపు సెకండ్ ఎంట్రీ గేట్ నమూనా చిత్రం

(5వ పేజీ తరువాయి)

రైల్వే స్టేషన్ పడమర వైపున వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, లేబర్‌కాలనీ, సంతోష్ నగర్, బాలాజీ నగర్, కప్పలనగర్.. వంటి కాలనీలు విస్తరిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ కూడా ఇక్కడికే దగ్గర అవుతుంది. ఆయా ప్రాంతాలకు చెందిన రైల్వే ప్రయాణికులు రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే అశోక్‌నగర్ దగ్గర ఉన్న రైల్వేలైన్ అండర్ బ్రిడ్జి దిగువ నుంచి చేరుకోవాలి. ఆర్టీసీ బస్టాండ్, కల్లూరు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీలు ఐదు రోడ్ల కూడలి మీదుగా రావాలి. వర్షం కాలంలో రైల్వే లైన్ అండర్ బ్రిడ్జిలో వర్షపు నీటితో నిండిపోయి ప్రయాణీల తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. అంతేకాదు.. ఒక్కోసారి రిజర్వేషన్ చేసుకున్న రైలును కూడా మిస్ అవ్వాల్సి వస్తుంది. వెంకటరమణ కాలనీ వైపు రెండవ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సెకండ్ ఎంట్రీ గేట్ ఏర్పాటు పనులు చేపట్టినా.. కాంట్రాక్టర్ అలసత్వమో మరే ఇతర కారణాలో అధికారులకే ఎరుక. పనుల్లో పురోగతి మందగించడం విమర్శలకు తావిస్తుంది. కీలకమైన రెండు ప్రధాన ద్వారాలు కలుపుతూ నిర్మించి ఫుడ్ ఓవర్ బ్రిడ్జి పనులు మొదలే కాలేదు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి గడువులోగా పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

మూడు నెలల్లో పూర్తి చేస్తాం

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ రీ మోడలింగ్ పనులు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.42.62 కోట్లతో చేపట్టాం. స్టేషన్ పునరుద్ధరణతో పాటు పడమర వైపు రెండవ ద్వారం, టికెట్ కౌంటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టాల్సి ఉంది. పనులు ఆలస్యంగా మొదలు పెట్టిన మాట నిజమే. మూడు నెలల్లో పూర్తి చేసి పడమర వైపు టికెట్ కౌంటర్ ప్రారంభిస్తాం. **- సత్యనారాయణ, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు, మహబూబ్‌నగర్**

టూరిజం డీవీఎంగా లక్ష్మీనారాయణ



కర్నూలు న్యూసిటీ ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్‌గా జి.లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం వెంకటరమణ కాలనీలోని హరిత అతిథి గృహంలో ఆయనకు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు. ఇక్కడ పని చేస్తున్న డీవీఎం చంద్రమౌళీశ్వరగౌడ్‌ను విజయవాడ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేస్తూ అక్కడ పని చేస్తున్న సెక్షన్ ఆఫీసర్ లక్ష్మీనారాయణను ఇక్కడకు బదిలీ చేశారు.

శివరాత్రి వేడుకల్లో అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ ఎస్ఈ ఉమాపతి

కల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా జిల్లాలోని శైవ క్షేత్రాలను సందర్శించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఉమ్మడి కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరిం చుకుని ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే ఫోకస్ లైట్లు, అలంకర ణకు ఉపయోగించే డెకరేషన్ లైట్లకు విద్యుత్ సరఫరా అందించే వైర్లను తనిఖీ చేసి జాయింట్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులు, కార్యవర్గాలకు సూచించారు. ప్రజలు రద్దీ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు, వైర్లకు దూరంగా ఉండాలని ఏదైనా ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, సమీప విద్యుత్ అధికారులకు, 1912 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

104 వాహనం, కారు అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన కారు, 104 వాహనం

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిలిచి ఉన్న 104 సంచార హెల్ప్ లైన్ వాహనాన్ని, వైద్యునికి సంబంధించిన కారు అద్దాలను గుర్తు తెలియని దుండుగులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. డా.వరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి 2 గంటల తరువాత 104 వాహనాన్ని పరిశీలించగా.. అప్పటికే ఆ వాహనం అద్దాలను, డాక్టరు కారు అద్దాలను దుండగులు పగులకొట్టారు. అలాగే 108, ఆసుపత్రి సిబ్బంది బైకులు సైతం చెల్లాచెదురుగా పడేశారు. ఈ విషయమై ఉదయాన్ని డా.వరప్రసాద్, డా.రంగస్వామి, 104 సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జీజీహెచ్‌కు త్వరలో మరో సీటీ స్కాన్



ఆర్ఐసీయూలో రోగిని పరామర్శిస్తున్న కర్నూలు ఎంపీ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌కు త్వరలో సీమెన్స్ కంపెనీకి చెందిన సీటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం వార్డులను సందర్శించారు. ఆర్ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డులో ఉన్న ఇద్దరు రోగులను కర్నూలు ఎంపీ పరామర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడానికి కావాల్సిన సహకారం అందిస్తామన్నారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ పవర్‌గ్రిడ్ సహకారంతో త్వరలో 128 స్లైస్ సామర్థ్యం గల సీటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వస్తుందన్నారు.

మీడియాపై పక్షపాతం వద్దు: ఏపీయూడబ్ల్యూజే

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మీడియాపై పక్షపాతం వద్దని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు అన్నారు. అసెంబ్లీ సమావేశాల కవరేజీకి కొన్ని పత్రికలు, టీవీ చానల్స్‌ను దూరం పెట్టడం సరికాదని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కూటమి ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు జి.కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్వీ సుబ్బయ్య, సలహాదారు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసుల గౌడ్ తదితరులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా కొన్ని పత్రికలు, టీవీ చానల్స్‌ను దూరం పెట్టారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా అదే పద్ధతి అవలంబించడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. అన్ని పత్రికలు, చానల్స్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



ఆలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఈనెల 24వ తేదీ నుంచి నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్/ డెబిట్ కార్డుల ద్వారా అన్‌లైన్‌లో ఎగ్జామినేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ఆరంభం అవుతుంది. ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసేందుకు మార్చి 31వ తేదీతో గడువు ముగియనుంది.

ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష

6వ తరగతిలో ప్రవేశానికి గతేడాది మాదిరి గానే పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్లోనే ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్ లిస్టు ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్టు అదే రోజు సెలక్షన్ లిస్టును సైతం వెల్లడిస్తారు. ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతారు.

సీట్ల కోసం తీవ్ర పోటీ

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కూడా ఉన్నత చదువులను అందుబాటులోకి తీసుకుని రావడమే ధ్యేయంగా ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. వెనుకబడిన మండలాలను గుర్తించి ఈ పాఠశాలలను ప్రారంభించారు. ఈ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించనున్నాయి.

కర్నూలు, జిల్లాలో ఆలూరు, పుట్టకలమర్రి (ఆస్పరి), కోడుమూరు, రచ్చుమరి (మంత్రాలయం), ముగతి (నందవరం), కడివెళ్ల (ఎమ్మిగనూరు), పెద్దకడబూరు, కోసిగి), మద్దికెర, పత్తికొండ పెద్దపాడు(కల్లూరు), ఓర్వకల్లు, (కృష్ణగిరి), జుల్లేకల్ (గూడూరు) సి.బెళగల్, గోనెగండ్ల, నంద్యాల జిల్లాలో గడివేముల, సంద్యాల, ఆళ్లగడ్డ బేతంచెర్ల పాణ్యం, పాములపాడు, డోన్, గోస్పాడు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మిడుతూరు, జూపుడుబంగ్లా, సిరివెల్ల, కొలిమిగుండ్ల, రుద్రవరం, ఉయ్యాలవాడ, పగిడ్యాల, బనగానపల్లి, మహానంది (తిమ్మాపురం).

పాఠశాలల్లో ఒక్కో చోట 100 సీట్ల చొప్పున ..

6వ తరగతిలో ప్రవేశం పొందాలనుకునే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2018 సెప్టెంబరు 1వ తేదీ నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. వీరికి పరీక్ష ఫీజు రూ.150 ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెప్టెంబరు 1వ తేదీ నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 30 మార్కులు పొంది ఉండాలి. వీరికి పరీక్ష ఫీజు రూ.75 సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2023-24, 2024-25 సంవత్సరాల్లో 4.5 తరగతుల్లో చదివి ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి. పరీక్షలో వచ్చే మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రతిపాదికన సీట్లు కేటాయిస్తారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం అబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. 5వ తరగతి స్థాయిలో ఉండే ఈ పరీక్ష తెలుగు/ ఇంగ్లీష్ మీడియంలో రాయవచ్చు. విద్యార్థులు సీఎస్ఈ.గవర్నమెంట్.ఇన్, ఏపీఎమ్ఎస్. ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలోనే విద్యా బోధన, విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఉచిత విద్య, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు పూర్తిస్థాయి సౌకర్యాలు ఉన్నాయి



కార్పొరేట్ విద్య

గ్రామాల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలని మోడల్ స్కూళ్లను తీసుకొచ్చారు. ఇంగ్లీషు మీడియంలో బోధన ఉంటుంది. ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులకు సిద్ధం చేస్తున్నాం. **- శ్యామ్యూల్ పాల్, డీఈవో, కర్నూలు**

పోలీసులకు బెదిరింపులు

- వేర్వేరు నంబర్ల నుంచి పోలీసులకు వైసీపీ నేత శంకర్ నాయక్ ఫోన్లు
- 'స్పా' వీడియోల లీక్‌లు ఆపాలని డిమాండ్
- లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులు
- తనను ఇరికించడంలో కుట్ర ఉందంటూ మొసలి కన్నీరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

వడిత్యా శంకర్ నాయక్.. రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు. వైసీపీ పాలనలో గిరిజనుల కోసం పాటుపడుతున్నది తానొక్కడినేనని చెలరేగిపోయిన నాయకుడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా రెచ్చిపోయిన ఆయన ఇప్పుడు పోలీసులపై బెదిరింపులకు దిగాడు. విజయవాడ వెటర్నరీ కాలనీలోని ఫీడర్ రోడ్డులో స్టూడియో 9 స్పా సెంటర్‌లో శంకర్ నాయక్ పోలీసులకు గదిలో మంచం కింద దొరికిపోయిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. శంకర్ నాయక్ వీడియో సామాజిక మాధ్యల్లో ట్రెండింగ్‌లో ఉంది. మాచవరం పోలీసులు స్టూడియో 9లో తనిఖీలు చేసి పది మంది ఉత్తరాది యువతులు, 11 మంది విటులను అరెస్టు చేశారు. వారిలో శంకర్ నాయక్ ఒకరు. తనపై పడిన మరక వదిలించుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు వైసీపీ ఐదేళ్ల పాలనలో శంకర్ నాయక్ చేసిన బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోజూట శంకర్ నాయక్ బాధితులు ఒక్కొక్కరుగా పోలీసులకు ఫోన్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శంకర్ నాయక్ పోలీసులకు ఫోన్లుచేసి బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది.

వీడియో లీక్‌లు ఆపకపోతే చనిపోతా..

శంకర్ నాయక్ అనంతపురం జిల్లాకు చెందిన నాయకుడు. ఎస్టీ కమిషన్‌లో సభ్యుడిగా నియమితుడైన తర్వాత విజయవాడలోనే నివాసం ఉంటున్నాడు. స్టూడియో 9 స్పాలో పోలీసులు సోదాలు చేసినప్పుడు ప్రతి అడుగును వీడియో చిత్రీకరణ చేశారు. అందులో ఉన్న యువతులనే కాకుండా గదుల్లో ఉన్న విటులను చిత్రీకరించారు. వాటిని కోర్టుకు ఆధారాలుగా చూపించడానికి భద్రపరిచారు. పోలీసులు చిత్రీకరించిన వీడియోల్లో కొన్ని బయటకు వచ్చాయి. వాటిలో శంకర్ నాయక్ వీడియో వైరల్ అవుతోంది. ఈ వీడియోను పోలీసులే మీడియాకు విడుదల చేశారని వారిపై నాయక్ ఆక్రోశంతో ఉన్నారు. రెండు రోజులుగా శంకర్ నాయక్ వేర్వేరు నంబర్ల నుంచి మాచవరం పోలీసులకు ఫోన్లు చేస్తున్నారు. తన వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని, దాన్ని బయటకు లీక్ చేయడం ఆపకపోతే చనిపోతానని బెదిరింపులకు దిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన తర్వాత శంకర్ నాయక్ ఏకంగా ఐఏఎస్‌లను బెదిరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు మాజీ సీఎస్‌లు శంకర్ నాయక్‌కు బాధితులుగా ఉన్నారని సమాచారం. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తానని వారిని బెదిరించినట్టు తెలిసింది. అంతేగాకుండా రాష్ట్రంలో గిరిజన గురుకుల పాఠశాలల సంక్షేమాధికారులను వివిధ కారణాలను చూపించి వేధించినట్టు తెలుస్తోంది.

స్పా అని తెలియదా..?

రెండు రోజులుగా శంకర్ నాయక్‌ను సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ఉతికి ఆరేయడంతో తాను బుద్ధిమంతుడినని చెప్పుకునే పనిలో పడ్డారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తానని సమాచారం పంపారు. తర్వాత దాన్ని రద్దు చేసుకుని సాయంత్రానికి మార్చుకున్నారు. స్టూడియో 9 భవనంలో స్పా సెంటర్ ఉందని తనకు తెలియదని కథలు వల్లించడం మొదలుపెట్టారు. బయటకు యూట్యూబ్ చానల్ బోర్డు కనిపించడంతో సందర్శించడానికి వెళ్లానని చెప్పుకొచ్చారు. తర్వాత ఒక వ్యక్తి తనను లోపలకు తీసుకెళ్లారని, ఆ కాసేపటికే పోలీసులు రావడంతో మంచం కింద దాక్కోమన్నాడని వెల్లడించారు. వాస్తవానికి స్టూడియో 9 స్పాలో ప్రవేశం, బయటకు రావడం చాలా కట్టుదిట్టంగా ఉంది. అమ్మాయిలతో వ్యవహారాలు నడిపే వారికి మాత్రమే ఇక్కడ తలుపులు తెరుచుకుంటాయి. ఇదంతా స్పా నిర్వాహకుడు చలసాని ప్రసన్న భార్గవ్ నియంత్రణలో ఉంటుంది. శంకర్ నాయక్ ఏ తప్పు చేయకపోతే ఎవరో చెబితే మంచం కింద ఎలా దాక్కున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. రాసలీలల వ్యవహారంలో పోలీసులకు అడ్డంగా దొరికిపోయిన శంకర్ నాయక్ దీనికి ఇప్పుడు రాజకీయ కోణాన్ని జత చేస్తున్నారు. కేవలం తనను కుట్రతో ఈ కేసులో ఇరికించి, విటుడిగా చిత్రీకరించారని మొసలికన్నీరు కారుస్తున్నారు.

రాజకీయ కక్షతోనే తప్పుడు ప్రచారం



శంకర్ నాయక్

గాంధీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన నేతగా తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక కుట్రతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేత, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆ విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడిమాలో తనపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. ఇరవై ఏళ్లుగా గిరిజనుల సమస్యలపై పోరాడుతున్నానన్నారు. నగరంలోని ఒక యూట్యూబ్ చానల్‌కు వెళ్లానని, అక్కడ స్పా సెంటర్ నిర్వహి స్తున్నట్టు తనకు తెలియదన్నారు. కొద్దిసేపటికి పోలీసులు అక్కడకు వచ్చారని, ఒక వ్యక్తి తనను గదిలో ఉండమని చెప్పడ ంలో గదిలోకి వెళ్లానన్నారు. అక్కడ 20 మందిని పోలీసులు అదుపు లోకి తీసుకున్నారని, కాని కేవలం తన ఫొటో, వీడియో మాత్రమే బహిర్గతం చేశారన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా మూడేళ్లు ఎంతో మంది గిరిజనుల సంక్షేమానికి కృషి చేశానని వివరించారు.

వైసీపీ నుంచి శంకర్ నాయక్ బహిష్కరణ

విజయవాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, వైసీపీ గిరిజన విభాగం నాయకుడు వడిత్యా శంకర్ నాయక్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. దీనికి సంబంధించి పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. శంకర్ నాయక్ విజయవాడ వెటర్నరీ కాలనీలో ఉన్న స్టూడియో 9 స్పా సెంటర్లో పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వైసీపీ క్రమశిక్షణ చర్యలను తీసుకుంది. ఇందులో భాగంగా శంకర్ నాయక్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు.

ఏటీఎం మిషన్ చోరీకి యత్నం

- స్థానికుల సాయంతో అప్రమత్తమైన పోలీసులు
- మిషన్‌ను వదిలేసి పరారైన దుండగులు



చోరీకి గురైన ఏటీఎం సెంటర్

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు జాతీయ రహదారిపై ఏటీఎం మిషన్‌ను చోరీకి యత్నించిన ఘటన కలకలం రేపింది. ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజా మున 1.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంకు ఆఫ్ బరోడాకు చెందిన ఏటీఎం మిషన్ చోరీకి ప్రయత్నించారు. ముందుగా 12 గంటల ప్రాంతంలో బళ్లారి చౌరస్తా సమీపంలోని ఓ టోయింగ్ వెహికల్‌ను చోరీ చేశారు. ఆ వాహనం ద్వారా చిన్నటేకూరుకు వచ్చారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రాన్ని టార్గెట్ చేశారు. ముందుగా షట్టర్ తొలగించి ఆ మిషన్‌కు టోయింగ్ వాహనానికి తాళ్లతో కట్టారు. ఆ తర్వాత మిషన్‌ను లాక్కెళ్లారు. సుమారు వంద మీటర్ల దూరం లాక్కెళ్లిన తర్వాత గ్రామానికి చెందిన యువకులు సినిమాకు వెళ్లి వస్తూ ఏటీఎం కేంద్రం చోరీ జరిగిన యత్నాన్ని గుర్తించారు. వెంటనే 100కు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ్ స్థలానికి చేరుకొని ఏటీఎం మిషన్ లాక్కెళ్లిన తీరును గుర్తించి ఆ మార్గాన్ని అనుసరించారు. ఉలిందకొండ క్రాస్ రోడ్డు వద్ద అగంతకులు ఏటీఎం మిషన్ లాకెళ్లతున్న విషయాన్ని గుర్తించారు. పోలీసులను గుర్తించిన దుండగులు టోయింగ్ వాహనాన్ని, మిషన్‌ను వదిలేసి పొలాల్లోకి పరారయ్యారు. పోలీసులు కాస్త దూరం వెంబడించినా ఫలితం లేకపోయింది. దుండగులు ఆ మిషన్‌ను కత్తిరించే ప్రయత్నం చేసినట్లుగా గుర్తించారు. ఏటీఎం మిషన్‌లో రూ.3 లక్షల నగదు సేఫ్‌గా ఉన్నట్లు గుర్తించారు.

యువకులకు అభినందన

చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి వెంటనే 100 పోలీసులను అప్రమత్తం చేసిన చిన్నటేకూరు చెందిన యువకులు మహేష్, ఇలియాజ్, అబ్దుల్ రెహిమాన్, హుశేన్‌బాషాలను డీఎస్పీ బాబు ప్రసాద్ అభినందించారు. డీఎస్పీ కార్యాలయంలో వీరందరికీ రివార్డులు అందించారు. యువత పోలీసులకు అసాంఘిక కార్యలకాలాపాలపై సమాచారం ఇస్తేనే నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.

సీజనల్ హాస్టళ్లను తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీజనల్ హాస్టళ్లను తనిఖీ చేసి సమగ్ర విచారణ చేసి వాస్తవాలతో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రంజిత్ బాషా విద్యా శాఖ, సమగ్రశిక్ష అభియాన్ అధికారులను ఆదేశించారు. 'సీజనల్ దోపిడీ' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలాల వారిగా ఎంఈవో-2, మండలంంలోని ఓ పాఠశాల హెచ్ఎంతో ఇద్దరు సభ్యులతో కమిటీ వేసినట్లు సమగ్రశిక్ష అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టుకో-ఆర్డినేటర్ (ఏపీసీ) టి.శ్రీనివాసులు సోమవారం ఆంధ్రజ్యోతికి వివరించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో సీజనల్ హాస్టళ్ల నిర్వహకుల గుండెల్లో దడ మొదలైంది. రైతులు, వ్యవసాయ కూలీలు గుంటూరు, తెలంగాణ ప్రాంతాలకు దాదాపు 2.50 లక్షల కుటుంబాలు వలస వెళ్లాయి. దీంతో పిల్లల చదువులు ఆగిపోకూడదన్న ఉద్దేశంతో జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి హాస్టల్‌లో 50 మందికి అవకాశం ఉంది. మధ్యాహ్న భోజనం పాఠశాలలో తింటే.. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం ఈ హాస్టళ్లలో వడ్డించాలి. ఆదివారం వంటి సెలవు రోజుల్లో మధ్యాహ్నం భోజనం వడ్డించాలి. అమ్మనాన్నలు లేని లోటు రానివ్వకుండా జాగ్రత్తగా చూసుకోవడానికి కేర్ కేటర్, బీఈడీ పూర్తి చేసిన ట్యూటర్‌ను నియమించారు. ఒక్కో కేంద్రానికి రూ.80 వేలు చొప్పున జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లకు ప్రభుత్వం నెలకు రూ.28 లక్షలు వెచ్చిస్తోంది. ఈ హాస్టళ్లను నిర్వహణ ఏజెన్సీ బాధ్యతలు తీసుకున్న స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాలు ప్రతినిధులు విద్యార్థుల కడుపు మాడ్చి దోపిడీ చేస్తుండడంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అయితే.. ఈ కమిటీ ఆకస్మికంగా తనిఖీలు చేసి వాస్తవాలతో నివేదిక ఇస్తుందా..? రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, సీజనల్ హాస్టళ్ల నిర్వాహకులు ఇస్తున్న మాముళ్లకు కక్కుర్తిపడి తూతూ మంత్రంగా తనిఖీలు చేసి అంతా బాగుందని నివేదిక ఇస్తుందా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే.. కర్నూలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు బినామీ పేరుతో సీజనల్ హాస్టళ్లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

హాస్టళ్లకు ఎల్‌ఈడీ టీవీల వితరణ



హాస్టల్ వార్డెన్‌కు ఎల్‌ఈడీ టీవీని అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమీపంలోని ఎస్సీ, బీసీ బాలికల హాస్టళ్లకు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది మూడు ఎల్‌ఈడీ టీవీలను అందజేశారు. ఈనెల 17న హాస్టల్‌కు తనిఖీ వెళ్లిన సందర్భంగా బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థినులు తమ హాస్టళ్లకు టీవీలు కావాలని జిల్లా ప్రధాన న్యాయాధికారిని కోరారు. ఈ మేరకు ఆయన కరూర్ వైశ్య బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులతో సంప్రదించి వారి సహకారంతో మూడు హాస్టళ్లకు మూడు ఎల్‌ఈడీ టీవీలను సోమవారం వితరణ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగలక్ష్మి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయులు, కరూర్ వైశ్య, పంజాబ్ నేషనల్ బ్యాంకుల మేనేజర్లు పీరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు: కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఉచిత ఇసుకను సాధారణ ప్రజల గృహ నిర్మాణాల అవసరాలకు అనుమతులు ఇవ్వాలని, వారిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా ఇసుకను సేకరించుకుని వ్యాపారం చేస్తున్నా, సరిహద్దులు దాటిస్తున్నా వారి వాహనాలను వెంటనే సీజ్ చేయాలన్నారు. మండల, గ్రామ సెక్రటేరియట్ అధికారులతో ఏర్పాటు చేయబడిన టీమ్‌ల సహాయంతో మెరుపుదాడులు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించుకుని ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణ జరుగుతుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు ఆర్డీవోలను ఆదేశించారు. నదులు, వాగులు దగ్గర ఉన్న తాగు నీటి సరఫరా కేంద్ర ప్రాంతాలలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించరాదని సూచించారు. అటువంటి ప్రదేశాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతుంటే వాహనాలను సీజ్ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య, అడిషినల్ ఎస్పీ హుశేన్‌పీరా, డీఎస్పీ రవీంద్రబాబు పాల్గొన్నారు.

గోడౌన్ తనిఖీ



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో సందీప్ కుమార్

గూడూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గూడూరులోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో బియ్యం ఇతర సరుకులు స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రామాంజనేయులు, సివిల్ సప్లై డీటీ నవీన్, గోడౌన్ ఇన్‌చార్జి నస్రీం ఉన్నారు.

● **ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి:** మార్చి ఒకటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో సందీప్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవా రం గూడూరులో పర్యటించిన ఆర్డీవో ప్రభుత్వ జూనియర్, ఎస్ఎస్‌వీ కళాశాలలను సందర్శించి ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట నగర కమిషనర్ రమేష్ బాబు ఉన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతంలో పాల్గొన్న జంటలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని జీవేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఓంశాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతం, ప్రవచనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీకే మహాలక్ష్మి, బీకే ఉషా కిరణ్, బీకే రాధాకృష్ణ హాజరయ్యారు. ఈ వ్రతంలో 18 జంటలు పాల్గొన్నాయి. స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కథ వివరించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నాయ కులు ప్రభాకర్ రెడ్డి, రంగ నాథగౌడు, మోహన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, గోవిందరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పెద్దయ్య, లింగం కృష్ణయ్య ఓంశాంతి సభ్యులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను తెరిపించండి

కలెక్టర్‌కు రైతు సంఘం నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను తెరిపించాలని రైతు సంఘం నేతలు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి కృష్ణ, గూడూరు మండల రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డిలు రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుల వద్ద ఇంకా దాదాపు 20లక్షల క్వింటాళ్ల విలువ చేసే పత్తి ఉందని, సీసీఐ కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని, ఇదే అదునుగా వారు క్వింటానికి 6వేల నుంచి రూ.6,500 మాత్రమే రైతుల చేతుల్లో పెడుతున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

కర్నూలు కలెక్టరేట్: జర్నలిస్టుల అక్రిడిటేషన్లను పునరుద్ధరించాలని యూనైటెడ్ జర్నలిస్టు ఫోరం కలెక్టర్ రంజిత్ బాషాకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నాగేంద్రుడు, జి.మునిస్వామి మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడిటేషన్ కాలపరిమితి ఈ నెల 28వ తేదీతో గడువు ముగియనుందన్నారు. వెంటనే నూతన అక్రిడిటేషన్లను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో యూజేఎఫ్ జిల్లా నాయకులు నీలం సత్యనారాయణ, చంద్రమోహన్, విజయకుమార్, మల్లికార్జున, నగర కోశాధికారి రాజశేఖర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ అధికారి వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌లో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో నిర్ధారణ పరీక్షల కోసం రోగులు అవస్థలు పడుతున్నారన్నారు.

అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ కోసం ప్రదక్షిణలు

నెల రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోని వైనం



సర్టిఫికెట్ల కోసం సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చిన ల్యాబ్ టెక్నీషియన్లు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ల్యాబ్ టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులు సర్టిఫికెట్ కోసం నెల రోజులుగా తిరుగుతున్నారు. 2024-25 బ్యాచ్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్‌లు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు ప్రాంతాలకు చెందిన వారు వంద మంది కోర్సు పూర్తి చేశారు. కోర్సు పూర్తయిన తర్వాత అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్‌తో విజయవాడ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారు ల్యాబ్ టెక్నీషియన్ వృత్తిని మొదలు పెట్టవచ్చు. అయితే నెల రోజులుగా అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ కోసం సూపరింటెండెంట్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కోర్సు పూర్తి చేసిన నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇంకా ఎన్ని రోజులకు సర్టిఫికెట్లు ఇస్తారో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల రోజులుగా సర్టిఫికెట్ కోసం తిరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, తక్షణమే సర్టిఫికెట్లు అందజేయాలని సంబంధిత క్లర్క్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

జగన్నాథ గట్టుపై నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగన్నాథగట్టు అభివృద్ధి సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జగన్నాథగట్టుపై వెలసిన ఉమా సమేత రూపాల సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జగన్నాథగట్టు అభివృద్ధి సమితి చైర్మన్ పి.నరసింహారెడ్డి, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమీపంలోని సాలమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటలకు గణపతి పూజతో వేడుకలు ప్రారం భమవుతాయని, బుధవారం ఉదయం 5 నుంచి 9 గంటల వరకు స్వామి వారికి అభిషేకం, క్షీరాభిషేకం ఉంటుందన్నారు. అర్ధరాత్రి 12 గటంటల నుంచి ఒంటి గంట వరకు లింగోద్భవ అభిషేకాలు, తెల్లవారుజామున 3 గంటలకు శివపార్వతుల కల్యాణం ఉంటుందన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు శివపార్వతుల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సమితి కోశాధికారి వాసుదేవయ్య, సభ్యులు నాగరాజు, సందడి మహేష్, మహాబలేష్, కల్కి మురళి, సర్వేశ్వర్ రెడ్డి, బి.వాసుదే వయ్య పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

సి.బెళగల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. రసాయనిక ఎరువులను వాడకం వల్ల భూమిలోని రైతు మిత్ర పురుగులు చనిపోతాయని, దీంతో రైతులకే నష్టమని అన్నారు. ఈసమావేశంలో రైతులు, ఎంపీఈవోలు ఉన్నారు.

ఇంటర్వ్యూలకు హాజరు కండి: ఎంపీడీవో

ఓర్వకల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు కార్పొరేషన్ కింద రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో శ్రీనివాసులు సోమవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 730 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈ ఇంటర్వ్యూలకు ఆ బ్యాంకు మేనేజర్లు హాజరవుతారన్నారు.

గ్రేడ్-3 ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌ఎం గ్రేడ్-3 పోస్టులను భర్తీ చేయాలని గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల సంఘం రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి, కర్నూలు, నంద్యాల జిల్లాల సీఐటీయూ కార్యదర్శులు ఎండీ అంజిబాబు, నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో సోమవారం జేసీకి వినతి పత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో పోస్టులను భర్తీ చేసి మిగిలిన జిల్లాలో భర్తీ చేయకపోవడం దారుణామన్నారు. అనంతరం జేసీకి వినతి పత్రం సమర్పించారు. జేసీ స్పందిస్తూ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను జేసీ ఆదేశించారు.

టైలర్స్ డేను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): టైలర్స్ డేను జయప్రదం చేయాలని జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్ బాషా కోరారు. సోమవారం నగరంలోని పెద్దమార్కెట్ వద్ద గల ఉర్దూఘర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో టైలర్స్ డే పోస్టర్‌ను అసోసియేషన్ ఇతర ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఖలీల్‌బాషా మాట్లాడుతూ ఈనెల 28న సాయంత్రం 6 గంటలకు ఉర్దూఘర్‌లో టైలర్స్ డేను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యక్షుడు నేషనల్ టైలర్ మహబూబ్ బాషా, బైనర్జీ టైలర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి బి.రామక్రిష్ణ, ఖాసిం పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో అన్యమతస్తులను రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మాళిగి భానుప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం శ్రీశైలం శివభక్త సేవా సమితి ఆధ్వర్యంలో పాతబస్టాండు వద్ద గల శ్రీశైలం సత్రం నుంచి కొండారెడ్డి బురుజు వరకు శివస్వా ములు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాళిగి భానుప్రకాష్ మాట్లాడుతూ శివస్వామిపై దాడి చేసిన అన్యమతస్తుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా సహాయ కార్యదర్శి గూడూరు గిరి బాబు, రామకృష్ణ, బాబురావు, సత్యనారాయణ, రవిప్రకాష్ గౌడు, శివనాగరాజు, చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీనివాసులు, శివస్వాములు పాల్గొన్నారు.

ఆటోలు ఢీ.. ఒకరి మృతి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దిపల్లె-నన్నూరు గ్రామాల మధ్య సోమవారం రాత్రి రెండు ఆటోలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పుల్లగుమ్మి, ఉయ్యాలవాడ ఆటోలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటోల్లో ఉన్న ప్రయాణికుల్లో లొద్దిపల్లె గ్రామానికి చెందిన పోతురాజు దాసు (45) మృతి చెందాడు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన రమీజాబి, కుమ్మరి వినోద్ కుమార్, వెంకటలచ్చమ్మలకు గాయాల య్యాయి. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటు సారా విక్రయిస్తే చర్యలు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు హెచ్చరించారు. సోమవారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమం అమలు తీరుపై ఆయన మాట్లాడారు. ఈనెల 19న ఎక్సైజ్ శాఖ మంత్రి కోల్లు రవీంద్ర చేతుల మీదుగా ప్రారంభమైన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసే దిశగా కార్యాచరణ రూపొందించుకున్నామని తెలిపారు. ఈ సమావేశం లో సీఐలు చంద్ర హాస్, రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల నసమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమ వారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్వర్యంలో నగర కార్యదర్శి నల్లన్న అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జీవోనెంబరు 17 తీసుకు వచ్చి సంక్షేమ బోర్డులోని రూ.450 కోట్లు ఇతర పథకాలకు వాడుకుందని విమర్శించారు. నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబీ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం ఏపీ మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం మద్దిలేటి అధ్యక్షతన నగర పాలక కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాబులాల్, నాగశేషులు, అయ్యరాజు, పద్మావతమ్మ, రాధ, కోటమ్మ పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయాలనని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. సమితి అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాల పేరుతో ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించారని విమర్శించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బీసన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సమితి ఉపాధ్యక్షులు శైలజ, నగర కార్యదర్శి కుమార్ రాజా, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌యూను ప్రక్షాళన చేయండి: ఏఐఎస్ఎఫ్



ఆర్‌యూ ఉపకులపతికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ కోరారు. సోమవారం ఆర్‌యూ ఉపకులపతి వెంకట బసవరావు, రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ వర్సిటీకి చెందిన వందల ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని కాపాడాలని గతంలో పలు మార్లు విన్నవించినప్పటికీ జిల్లా అధికారులు, వర్సిటీకి చెందిన అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో ఉన్న డిపార్ట్‌మెంట్లకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, శివ, పవన్, సురేష్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత రిడ్జ్ స్కూల్

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫర్‌మెన్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో రిడ్జ్ పాఠశాల విజేతగా నిలిచింది. దాదాపు 16 టీములు పాల్గొన్నాయి. ఫైనల్‌లో అండర్-12 బాలుర విభాగంలో రిడ్జ్ పాఠశాల జడ్పీహెచ్ఎస్ తుంగభద్ర పాఠశాల పోటీ పడగా 16 నిమిషాల్లో అఫ్సాన్ క్రీడాకారుడు ప్రతిభ కనబరిచి గోల్‌ను వేయడంతో రిడ్జ్ పాఠశాల విజేతగా నిలిచింది. అండర్-14 విభాగంలో రిడ్జ్ పాఠశాల, గద్వాల జట్టు పోటీ పడగా 3-2 స్కోరుతో రిడ్జ్ పాఠశాల విజయం సాధించింది. బాలికల విభాగంలో కర్నూలు లక్ష, గద్వాల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో కర్నూలు లక్ష టీమ్ గద్వాల జట్టుపై 1-0తో విజయం సాధించింది.

కార్మిక నాయకుడు రాజగోపాల్: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కార్మిక నాయకుడు రాజగోపాల్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. సోమవారం పాతబస్తీలోని హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్‌లో కామ్రేడ్ రాజగోపాల్ సంస్మరణ సభ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.నిర్మల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, రాధాక్రిష్ణ, రాముడు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

సి.బెళగల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని సి.బెళగల్, కంబంధహాల్, పోలకల్లు, తిమ్మనదొడ్డి గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ పురుషోత్తంకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బ్యాంకర్లతో సమావేశం

గూడూరు ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన దరఖాస్తులపై నగర కమిషనర్ ఏవీ రమేష్ బాబు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సోమవారం గూడూ రులోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీకి సంబంధించి 65 యూనిట్లు మంజూరు కాగా, 361 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

బీసీ కులగణన చేపట్టాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రాంబాబు

కల్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ బీసీ కులగణన చేపట్టి బీసీలకు రావాల్సిన విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపెంట రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులుకు వినతిపత్రం అందించారు. పవన్‌కుమార్, బజారి, వెంకటరమణ, సురేంద్ర, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీటు పోతుందనే భయంతోనే అసెంబ్లీకి

- అవాకులు పేలితే ప్రజలు రాళ్ల వర్షం కురిపిస్తారు
- జగన్‌పై మండిపడ్డ 'కుడా' చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సీటు పోతుందనే భయంతోనే జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చాడని 'కుడా' చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమె త్తారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జగన్ అసెంబ్లీలో ప్రవర్తించిన తీరును చూసి ప్రజలు అసహ్యంచుకుంటు న్నారని తెలిపారు. చంద్ర బాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ పట్ల జగన్ అవాక్కులు పేలితే ప్రజలు రాళ్లతో దాడి చేసి రాష్ట్రం నుంచి తరిమిసేందుకు సిద్ధంగా ఉంచార న్నారు. గతంలో జిల్లాల పర్యటనకు వచ్చిన సమ యాన చెట్లను నరికించి పచ్చని నగరాలు, పట్టణాలను అంధకా రంలోకి నెట్టి వేశారని మండిపడ్డారు. జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు ఇసుక, మద్యం, భూ కుంభకోణంలో విచ్చల విడిగా దోచుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని తెలిపారు. కూటమి దివాలా తీసిన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని, రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి అవసరమైన నిధులు తెచ్చి ప్రజలకు మంచి చేస్తున్నా చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలితే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

జీవో విడుదల చేయాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ హమాలీలకు కొత్త కూలి రేట్ల జీవోను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌస్ దేశాయ్ హాజరై మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడం లో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ, సెక్రటరీ సోలోమన్‌రాజు, శివ, వినయ్, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న నగర పాలక అధికారులు, బ్యాంకర్లు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో బీసీ కార్పొరేషన్‌కు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో మొదటి రోజు టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పర్యవేక్షణలో అధికారులు, బ్యాంకర్లు, దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. నగరంలో 1 నుంచి 70వ సచివాలయం పరిధిలో దరఖాస్తు చేసుకున్న 1507 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.కుమార్ పాల్గొన్నారు.

కోడుమూరు: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాముడ అధ్యక్షతన సోమవారం ఇంటర్వ్యూ లు నిర్వహించారు. మండలానికి మొత్తం 60 యూనిట్ల విడుదల చేసింది. సబ్సిడీ రుణాల ఇచ్చేందుకు వివిధ బ్యాంకు అధికారులు ముందుకు వచ్చాయి. సబ్సిడీ రుణాల కోసం దాదాపు 1,261 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.



కోడుమూరులో..

గూడూరు: గూడూరులోని మండల పరిషత్, వెలుగు కార్యాలయాలో ఎంపీడీవో శివనాగ ప్రసాద్, ఆయా బ్యాంక్ అధికారులు అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది గ్రామాలకు బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 50 యూనిట్స్ మాంజురు కాగా, అభ్యర్థుల నుంచి 388 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్వ్యూకు 133 మంది మాత్రమే హాజరుకాగ వారికి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాట





మండలంలోని హుశేనాపురం గ్రామంలో 200 ఇళ్లు ఉండగా, 1,500 పైగా జనాభా ఉంది. గ్రామం ఏర్పడినప్పటి నుంచి గ్రామానికి రోడ్డు లేదు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబుకు కృషి మేరకు రూ.92లక్షలతో నూతనంగా సీసీ రోడ్డు, కల్వర్టును నిర్మించారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **- తుగ్గలి**

సాగు చేసే వారికే పొలాలు అప్పగిస్తాం

తుగ్గలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను సాగుచేస్తున్న రైతులకే పట్టా ఇచ్చి అప్పగిస్తామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. సోమవారం తుగ్గలిలో మాట్లాడుతూ జీవో నెం.30ను అనుసరించి గ్రామాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులు వచ్చే నెల 15వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 15-10-2019కి పూర్వమే భూమి స్వాధీనంలో ఉన్న పొలాలకు మాత్రమే పట్టాలు ఇస్తామన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

ఆలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాల మొదటి సెట్ ఆలూరు పోలీసు స్టేషన్‌కు చేరాయి. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవరావు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృపాకర్ ప్రశ్నపత్రాలను భద్ర పరిచారు. మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్, స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



పరిశీలిస్తున్న ప్రిన్సిపాళ్లు

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

మద్దికెర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామం ఎస్సీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, సర్పంచ్ బురుజుల విజయుడు అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'పది రోజులకు ఒకసారి తాగునీరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కాలనీని పరిశీలించారు మోటార్లు వేయడంతో చివరలో ఉన్న వారికి నీరు రావడం లేదని, కాలువలో ఉన్న వీధి కొళాయి తొలగించి మరమ్మతులు చేస్తామన్నారు.

పట్టా కోసం దరఖాస్తు చేసుకోండి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఇది వరకే ఇళ్లు నిర్మించకున్నవారు పట్టా మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీరాముడు తెలిపారు. జీవో నెం.30 విడుదల చేసిందని వాగులు, వంకలు, రోడ్లు, రహదారులపై కాకుండ ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబరు 15 కంటే ముందు ఇళ్లు నిర్మించుకున్నవారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస ఆచారి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎమ్మిగనూరు క్రాస్ రోడ్డు నుంచి శివారు వరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రమాదంలో చిన్నారి మరణించడం పట్ల సోమవారం నిరసన తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మైనార్టీ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ మాట్లాడుతూ రద్దీ ఉండే రహదారిలో ప్రమాదాలు జరుకుండా చర్యలు తీసుకోవాలని గత ఏడాది అప్పటి సబ్ కలెక్టర్‌ను కోరామన్నారు. చిన్నారి మృతికి అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్‌ను నియంత్రించకనే ప్రమాదాలు జరుగతున్నాయని కాంగ్రెస్ నాయకుడు దిలీప్ ధోకా అన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతన 26వేలు ఇవ్వాలని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జనాభాకు తగ్గట్టు కార్మికుల సంఖ్యను పెంచకుండా ఉన్నవారిపైనే పని భారాన్ని పెంచడం సరికాదన్నారు. అనంతరం కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. కల్లుబావి రాజు, హుస్సేని, పేక్‌షావలి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గంగన్న, కార్మిక సంఘం నాయకులు జాన్ బాబు, శాంత, శ్రీనివాసులు, స్వీపర్స్ నాయకులు విజయ లక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపం లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి తెలిపిన మేరకు.. బేల్దారుగా జీవనం సాగిస్తున్న బోయరాజు (33) ఉరేసుకొని మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. భార్య ఉరేసుకొని చనిపోయినట్లు చెబుతుండగా మృతుడి తల్లి మాత్రం కుమారుడు మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేసింది. భార్యాభర్తలు ముందురోజు గొడవపడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ముత్తుకూరులో మరొకరు..

ఆస్పరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తుకూరులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పత్తికొండ తాలూకా మద్దికెరకు చెందిన శంకరబండ నెట్టికంటయ్య(36) ఈ నెల 17వ తేదీ ముత్తుకూరులోని అక్క ఇంటికి వచ్చాడు 19వ తేదీ మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం పొలాల్లో అనుమానాస్పదంగా మృతిచెందాడు. కుటుం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్జీలను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వకరించారు. మండలంలోని సంబంధిత శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన అర్జీల్లో కొన్ని

1. సర్వే నెం. 69పైకిలో 8.39 ఎకరాల భూమి ఉందని, ఎల్‌పీఎం నంబర్ తప్పుగా నమోదు చేశారని సరిచేయాలని ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి అర్జీ సమర్పించుకున్నారు.

2. పట్టణంలోని 38లో డ్రైనేజీ పనులను పూరి చేయాలని సమస్యను తీర్చాలని వార్డు ప్రజలు అర్జీ ఇచ్చాన్నారు.

3. సర్వే నెం. 75/ఏ3సిలో తనకు రెండు ఎకరాల భూమి ఉండగా, రీ-సర్వేలో 1.87 ఎకరాలు మాత్రమే చూపిస్తోందని సరిచేయాలని మంత్రాలయం మండలం సింగరాజునహళ్లి గ్రామానికి చెందిన రాజు అర్జీ ఇచ్చారు.

4. తనకు సర్వే నెం. 144/1లో 3.66 ఎకరాల భూమి ఉందని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి చెందిన సయ్యద్ అహ్మద్ అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్పీవో నూర్జహాన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పద్మజ, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వరులు, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఉప తహసీల్దార్లు గుండాల నాయక్, వలి బాషా పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య



ఆస్పరిలో తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతిపత్రం గిడ్డయ్య

ఆస్పరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశల్లో వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రజలు తాగునీటికి తుంగభద్ర దిగువ కాలువపై ఆధారపడ్డాన్నారు. గూళ్యం సమీపంలో ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని 8.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తే 80 వేల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల మందిజుట తాగునీరు అందుం తుందన్నారు. అనంతరం తాహసీ ల్దార్ రామేశ్వరరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. విరుపాక్షి, కృష్ణమూర్తి బడేప్ప, బ్రహ్మయ్య, నల్లన్న, రామాంజిని, రంగప్ప, రామాంజిని పాల్గొన్నారు.

హొళగుంద: వేదవతి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని సీపీఐ కార్యదర్శి మారెప్ప సోమవారం డిమాండ్ చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ నిజాముద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో రాజజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ మొత్తం 1,704 మంది దరఖాస్తు చేశారని, ఎంపీపీ సమావేశ భవనంలో హాజరు కావాలన్నారు. మండలానికి 60యూనిట్లు మంజూరయ్యాయని, 44 గ్రామాలకు సంబంధించి ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

స్వచ్ఛత ఎక్కడ?



పాఠశాల వద్ద చెత్త

ఆదోని టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. దీంతో రూ.కోట్ల ప్రభుత్వ నిధులు ఎక్కడ ఖర్చు పెడుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాయిబాబా నగర్‌లో పురపాలక పాఠశాల ప్రహరీకి పక్కనే భారీగా చెత్త పేరుకుపోయింది. విద్యార్థులు అనారోగ్యాల బారినపడే ప్రమాదముందని పారిశుధ్య పనులు చేయాలని ప్రభుత్వ ఆస్పత్రుల సలహా మండలి సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ కోరారు.

జలకంఠేశ్వర ఆలయ వార్షికోత్సవం

ఆలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జలకంఠేశ్వర స్వామి ఆలయ 12వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయలంలో ప్రత్యేక పూజలు చేశారు. కిష్టప్ప, వెంకటేష్, హనుమప్ప, వీరేష్, సిద్దేశ్వర పాల్గొన్నారు.

సారూ.. ఇదేం తీరు..!

- బాగున్న మరుగుదొడ్లను కూల్చేసిన హెచ్‌ఎం

దేవనకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో నూతన మరుగు దొడ్లు నిర్మిస్తామని ఉన్నవాటినే కూల్చేశారు. మూడేళ్ల క్రితమే ప్రభుత్వం అధునాతన మరుగుదొడ్లు నిర్మించింది. అయితే ఏమైందో ఏమో సోమవారం మరుగుదొడ్డిని కూల్చివేసి సామగ్రి హెచ్‌ఎం సొంత ప్రయోజనాలకోసం తరలించినట్లు గ్రామానికి చెందిన నారిపోగు నర్సప్ప అనే యువకుడు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం మద్దిలేటిని వివరణ కోరగా ముంబైకి చెందిన ఎన్జీవో సంస్థ నూతన మరుగుదొడ్లు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేస్తామంటే కూల్చివేశామని, సామాగ్రిని బంధువుల ఇంటి భద్రం చేశామన్నారు.



కూల్చివేసిన మరుగుదొడ్లు

నెట్టేకల్లు రోడ్డును వెడల్పు చేయండి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నెట్టేకల్లు, సాంబగల్లు క్రాస్ రోడ్డును వెడల్పు చేయాలని గ్రామ మాజీ సర్పంచ్‌లు వీరన్న, బాలరాజు, రవిశంకర్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్. 167 బైపాస్ రోడ్డుతో వాహనాల రద్దీతో ప్రమదాలు జరుగుతున్నాయన్నారు.

దాడి అమానుషం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో శివ స్వామిపై దాడి చేయడం అమానుషమని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ భక్తుడిపై చెప్పుతో దాడి చేయడం కలిచివేసిందని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కళాశాల కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కళాశాల కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో నూతన డిజిటల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులకు అనువైన డిజిటల్ ల్యాబ్‌ను రూపొందించామన్నారు. ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దనే సరుకులు ఇవ్వాలి

మద్దికెర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి సరుకులు ఇవ్వాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కేవీ రమణబాబు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ధర ప్రకారమే బియ్యం, కందిబేడలు, చక్కెర అందించాలన్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

మద్దికెర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దారికి అడ్డంగా ఉండే స్తంభాలను సరిచేసి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేస్తామని విద్యుత్ ఏఈ మహ్మద్ రఫి అన్నారు. ఎస్‌ఈ ఉమాపతి ఆదేశాల మేరకు బస్టాండు వద్ద అడ్డంగా ఉన్న స్థంభాన్ని పరిశీలించారు. విద్యుత్ స్థంభాన్ని మార్చాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు జిల్లా అధికారులకు తెలిపారన్నారు.

భూస్వాములను ఎదిరించిన రామయ్య

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య



చదువుల రామయ్యకు నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరుడుగట్టిన భూస్వాములన ఎదిరించిన ఎర్రజెండా ముద్దుబిడ్డ దివంగత చదువుల రామయ్య అని సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. సోమవారం 33వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళి అర్పించారు. పత్తికొండకు కృష్ణా జలాలు తేవడానికి రాజోలి బండ ద్వారా తాగు, సాగునీటి సాధనకు పోరాడర న్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసా హెబ్, సుల్తాన్, ఉమాపతి, కారన్న, వీరన్న, నెట్టికంటయ్య, ఉపేంద్ర పాల్గొన్నారు.

అనర్హత తప్పించుకోడానికే అసెంబ్లీకి జగన్



స్పీకర్, జనసేన ఎమ్మెల్యేలతో పార్థసారథి

ఆదోని, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనర్హత తప్పించుకోవడానికే మాజీ సీఎం జగన్ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. సోమవారం అసెంబ్లీలో బీజేపీ, జనసేన ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ అయ్యన్న పాత్రుడును కలిశారు. వైసీపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోడానికి ప్రయత్నించారని పది నిమిషాలు కూడా సమావేశాల్లో కూర్చోలేదన్నారు. ప్రతిపక్ష హోదా కోసమే తాపత్రయపడుతున్నారని ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి : డీఈ



సీసీ రోడ్ల పనులు పరిశీలిస్తున్న డీఈ శేషయ్య

మద్దికెర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ డీఈ శేషయ్య అన్నారు. సోమ వారం బస్టాండు వద్ద రూ.10 లక్షల జడ్పీ నిధులతో చేస్తున్న పనులను పరిశీలించారు. మండలంలో మొత్తం 38 పనులు పూర్తయ్యా యని, ఇప్పటి వరకు రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. మరో రూ.కోటి విలువ చేసే పనులకు ప్రతిపాదనలు పంపా మన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మురళిధర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈలు విష్ణువర్దన్, చంద్ర ఉన్నారు.

గడ్డివామికి నిప్పు

పత్తికొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని బైపాస్ వద్ద తన గడ్డివామికి నిప్పు పెట్టారని బాధితుడు నాగన్న తెలిపారు. బాధితుడి కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లిందని ఎద్దుకు కూడా కొంత కాలిందని తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, వీఆర్వో సాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.



కాలిపోతున్న గడ్డివామి

క్షయను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి



ఆదోనిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆదోని టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): క్షయను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చని టీబీ యూనిట్ ఎంపీహెచ్ఎస్ బాబురాజు అన్నారు. సోమవారం కస్తుర్బా పాఠశాలలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకితే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ అంజలి బాయి, వైద్య సిబ్బంది సుబ్బమ్మ బాయి, సిబ్బంది పాల్గొన్నారు.

తుగ్గలి: క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలని జియో మైసూరు కంపెనీ డైరెక్టర్ మానస రంజన్ బిశ్వాల్, మేనేజర్ రామ్మోహన్ సోమిరెడ్డి అన్నారు. సోమవారం జొన్నగిరి, పగిడిరాయి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంపెనీ ప్రతినిధులు, హెచ్ఎం, ఉపాధ్యా యులు ఉపేంద్ర, భీమేశ్వరయ్య ఉన్నారు.

రూ.4 లక్షలు చోరీ

- బైకులో ఉంచిన నగదు అపహరణ

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బైకు పెట్రోల్ ట్యాంకు కవర్‌లో ఉంచిన రూ.4 లక్షలు చోరీ చేసిన ఘటన కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలో సోమవారం జరిగింది. వివరాలివీ.. పెద్దహుల్తి గ్రామానికి చెందిన వరలక్ష్మి ఈ మధ్యనే తన భూమిని పత్తికొండ వాసికి విక్రయించారు. కొనుగోలుదారులు సోమవారం రూ.4 లక్షలు వరలక్ష్మికి ఇచ్చారు. ఆమె డబ్బును తీసుకొని తన అల్లుడితో పాటు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తూ పత్తికొండలోని అంబేడ్కర్ సర్కిల్‌లోని ఓ హోటల్ వద్ద టిఫిన్ చేయడానికి ఆగారు. డబ్బును బైకు పెట్రోల్ ట్యాంకు కవర్ మర్చిపోయి హోటల్‌లోకి వెళ్లారు. వెంటనే డబ్బులు గుర్తుకు రావడంతో బైకు వద్దకు వచ్చి చూడగా డబ్బు కనిపించలేదు. వరలక్ష్మి సీఐ జయన్నకు ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లాడుతూ సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

బాలికపై కోతి దాడి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలోకి దూరిన ఓకోతి బాలికపై దాడిచేయడంతో బాలికకు గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణంలోని ముస్లిం వీధికి చెందిన మహ్మద్ బాషా, మహ్మద్ భాను కుమార్తె రజియా సుల్తాన్ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా కోతి దాడి చేసింది. తల్లిదండ్రులు ఆసుపత్రిలో చికిత్స చేయించారు.

కోతకు గురైన మట్టి రోడ్డు

● ప్రమాదకరంగా
జుమాలదిన్నె-ఉరుకుందకు వెళ్లే కల్వర్టు రోడ్డు
● ఏర్పాటు చేయని సూచిక బోర్డులు
● నిత్యం ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కోసిగి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ఉరుకుందకు వెళ్లే ప్రధాన కల్వర్టు రోడ్డు కోతకు గురైంది. దాంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉరుకుందలోని నరసింహ ఈరన్న స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు మండల కేంద్రం నుంచి వెళ్తుంటారు. అయితే.. జుమాలదిన్నె గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డు గత వర్షాకాలంలో కోతకు గురి అయింది. అప్పటికప్పుడు ఆర్అండ్బీ సిబ్బంది మట్టితో కోతకు గురైన రోడ్డును పూడ్చారు. అయితే ఇప్పుడు మట్టికుప్పలు గుంతలు పడి మళ్లీ కోతకు గురి కావడంతో ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయక పోవంతో రెండు రోజుల క్రితం రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు గుంతల్లో ఇరుక్కుపోయింది. ఆర్అండ్బీ అధికారులు స్పందించి కోసిగి నుంచి జుమాలదిన్నె గ్రామం మధ్యలో కోతకు గురైన కల్వర్టు రోడ్డును బాగు చేయాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వాహనదారులు కోరుతున్నారు.


కోతకు గురైన రోడ్డులో వెళ్తున్న కారు

గురు వైభవోత్సవాలకు రావాలని ఆహ్వానం


మంత్రి టీజీ భరత్‌కు ఆహ్వానపత్రిక ఇస్తున్న శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రిన్సిపల్ సెక్రటరీ విజయ చంద్రలను కలిసి ఆహ్వాన పత్రికలను ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ అందజేశారు. సోమవారం రాత్రి అమరావతి సెక్రటేరియట్‌లో అసెంబ్లీ సమావేశం అనంతరం వారిని వేర్వేరుగా కలిసి రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, పరిమళ ప్రసాదం, ఆహ్వానపత్రికను అందజేశారు. మంత్రి టీజీ భరత్ ఉత్సవాలకు హాజరవుతున్నారని శ్రీమఠం అధికారులు తెలిపారు.

సీజనల్ హాస్టళ్లకు విద్యార్థులు హాజరు



సీజనల్ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీజనల్ హాస్టళ్లకు విద్యార్థులు హాజరయ్యారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో సీజనల్ దోపిడీ కథనం ప్రచురితం కావడంతో కోసిగిలోని అన్ని సీజనల్ హాస్టళ్ల నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. మండల పరిధిలోని కందుకూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థుల కోసం సీజనల్ హాస్టల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మూడు, నాలుగు రోజులుగా హాస్టల్ మూత పడిందని వార్త ప్రచురి తం కావడంతో సోమవారం ఉదయమే గ్రామంలోని సీజనల్ హాస్టల్ ను తెరిచి విద్యార్థులకు ఉదయం టిఫిన్ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్ బాషా, స్థానిక టీడీపీ నాయకులు కురువ అయ్యన్న, కురువ రామలింగ సీజనల్ హాస్టల్‌ను పరిశీలించారు. సక్రమంగా విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసి బాగా చూసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు వలస వెళ్లిన పిల్లలను చూసుకునే బాధ్యత సీజనల్ హాస్టల్ నిర్వాహకులదేనన్నారు.

ఘనంగా బీరప్ప స్వామి దేవర


దేవతామూర్తులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో వెలసిన బీర లింగేశ్వరస్వామి దేవర ఘనంగా ప్రారంభమైంది. సోమవారం పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన యాదగిరప్ప, ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన వన్నికెరప్ప స్వాముల వారు పల్లకిలో గ్రామానికి చేరుకున్నారు. త్రిమూర్తులను వేర్వేరు పల్లకిలో తుంగభద్ర నది వద్దకు తీసుకెళ్లి అక్కడ పూజలు చేసి తుంగభద్ర జలాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం గ్రామంలోకి తీసుకువచ్చారు. గ్రామ పురవీధుల గుండా స్వామివార్లను బీరప్పడ్రోళ్లు, గొరవయ్యల నృత్యాలతో ఊరేగించిన దృశ్యం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించి అభిషేకాలు, హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులతో సందడిగా మారింది. సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి మూలవిరాట్‌ను తెల్లవారుజామునే ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు ఆచరించారు. మరి కొంత మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఎంపీడీవో బంగారమ్మ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలంలో మొత్తం 622 మంది దరఖాస్తులు చేసుకోగా 426 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఆయా బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి దరఖాస్తులను స్వీకరించారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు..

కౌతాళం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండలంలోని ఆయా బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. దరఖాస్తుదారులు తమ వెంట దరఖాస్తు రశీదు, ఆధార్ కార్డు, బ్యాంకు బుక్, పాన్‌కార్డు, యూనిట్‌కు సంబంధించిన ఫొటోలను తమ వెంట తీసుకురావాలని తెలిపారు. అంతకుమందు మండలంలోని బ్యాంకు అధికారులతో చర్చించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ యోగేశ్వరరెడ్డి, ఏవో సత్యన్న, సిబ్బంది ఉన్నారు.

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

ఎమ్మిగనూరు/రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దని సీపీఎం నాయకుడు రాముడు కోరారు. సోమవారం కాంట్రాక్టు కార్మికులతో కలిసి తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. అలాగే స్థానిక తపాలా కార్యాలయం ముందు మోకాళ్లలో నిలబడి సీఎంకు లేఖలను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగరాజు, ఇస్మాయిల్, మునీర్, లక్ష్మన్నలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి: ఏఐటీయూసీ

వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులు 17రోజుల పాటు సమ్మె చేయగా, అప్పటి ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాల కోసం ఒప్పందాలను చేసుకుందని, వాటిని అమలు పర్చడంలో కూటమి ప్రభుత్వం విలఫలమైందని ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, పట్టణ అధ్యక్షుడు విజయేంద్ర అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్ కోసం మున్సిపల్ కార్మికులు దీర్ఘకాలంగా పోరాటాలు చేస్తున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాగప్ప, విక్రమ్, సల్మాన్, లక్ష్మన్న లు పాల్గొన్నారు.


తపాలా కార్యాలయం ముందు మోకాళ్లపై నిలబడి పోస్టులను పంపుతున్న సీపీఎం నాయకులు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి


ఐటీడీపీ కార్యకర్తలకు జెండాను అందజేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా చూడాల్సిన బాధ్యత ఐటీడీపీ సోషల్ మీడియా టీమ్‌కు ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాధవరంలోని తన నివాసంలో మంగళగిరి టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన జెండాలను టీడీపీ వారధులుగా పని చేస్తున్న ఐటీడీపీ సోషల్ మీడియా బృందం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి ప్రభుత్వానికి దగ్గరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘు నాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, హనుమంతరెడ్డి, అంజినేయ, వెంకన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ప్రమోషన్ ఇవ్వాలని చూస్తున్నారు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్లతో అర్హత లేని వారికి ఐసీడీఎస్ సీడీపీవో, సీనియర్ అసిస్టెంట్లు ప్రమోషన్ ఇవ్వాలని చూస్తున్నారని కందనాతి గ్రామానికి చెందిన ప్రకాష్ ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల వేదికలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య ఆనందమ్మ గ్రామంలో ఉన్న 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా 2017 నుంచి పనిచేస్తుందన్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్ అనారోగ్యంతో ఉద్యోగానికి రాజీనామా చేసిందన్నారు. దీంతో టీచర్ పోస్టు ఖాళీ ఏర్పడిందన్నారు. అయితే ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తన భార్య ఆనందమ్మకు కాకుండా 3వ సెంటర్‌లో పని చేస్తున్న షేక్ పర్‌హజాన్ ను అంగన్‌వాడీ టీచర్‌గా నియమించా లని సీడీపీవో సఫరున్నిసాబేగం, సీనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మీ లోపాయికార ఒప్పందం కుదుర్చుకొని తన భార్యకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. అయితే షేక్ పర్‌హజానా సర్టిఫికెట్లు నకిలీవని ఆయన తెలిపారు. ఈ విషయంపై సీడీపీవో సఫరున్నిసాబేగంను వివరణ కోరగా మా దృష్టికి ఈ విషయం వచ్చిందని, ఉన్నతాధికారులకు తెలిపామన్నారు.

ప్రైవేటు స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సరేంద్రబాబు, మునిస్వామి, మనోహర్, నాగరాజు, పాండు పూర్ణ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కుమారస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని, పాఠశాల పెట్రోల్ బంకుకు అతి సమీపంలో ఉన్నదని భవనాలు మార్చాలని అధికారులు సూచించినప్పటికి ఆదేశాలు అమలు కాలేదన్నారు. పాఠశాలలో ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఉందని వారన్నారు. విద్యాశాఖ అధికారాలు వెంటనే అనుమతి ని రద్దు చేసి పాఠశాలను మూసి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, రాము, పాండు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూల్‌ను సీజ్ చేయాలి

నందవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నందవరంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేయాలని ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిద్, ఆర్‌యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘనాథ్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు


ముస్తాబైన ఆలయం

గోనెగండ్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలు, అమ్మవారి ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. గత రెండురోజులుగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు. శివనామస్మరణతో శైవదేవా లయాలు మరుమోగుతున్నాయి. నీలకంఠేశ్వరస్వామి వారిని పూలతో అలంకరించారు. గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె, కులుమాల, అలువాల, వేముగోడు, తిప్పనూరు. ఈరంపల్లి, పుట్టపాశం, అగ్రహారం, బైల ప్పల, గంజహళ్లి, పెద్దమరివీడు, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననే లటూరు, గ్రామాలతోపాటు మండల కేంద్రమైన గోనెగండ్లలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహాశివరాత్రి రోజు జాగరాణ, పార్వతి పరమేశ్వరుల కల్యాణం చేసేందుకు గాను ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

ఎంఈవో రాగన్న


శిక్షణలో తయారు చేసిన వస్తువులతో అధికారులు, అంగన్‌వాడీలు

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసే బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపైనే ఉందని ఎంఈవో రాగన్న, ఉన్నత పాఠశాల హెచ్ఎం అంపయ్య అన్నారు. సోమవారం మంత్రాలయంలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఐదవ రోజులో భాగంగా శిక్షణలో తయారు చేసిన రాజు, రాణి, విజయానికి గుర్తుగా బెల్టును ధరించి ప్రశంసా పత్రాలను తయారు చేసి ఒకరికొకరు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉపయోగపడుతుందని, పిల్లలతో కథలు, పాటలు, ఆటలతో వారి సామాజిక భావోద్వేకంగా రాణించేందుకు కృషి చేయాలన్నారు. సీఆర్‌పీలు రామకృష్ణ, వంశీకృష్ణ, నాగరాజులు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, పాఠశాల పీఈటీ నరసింహరాజు, హెచ్ఎం రామ్మోహన్, అంగన్‌వాడీ టీచర్లు భీమశ్వరి, విశాలాక్షి, శ్వేత, ద్రాక్షాయణి, అనిత, రజియా, మాధురి, కవిత, లింగమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

గ్రాసం, తాగునీటి కొరత

తల్లడిల్లుతున్న మూగజీవాలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి కాలం రాక ముందే ముందస్తు ఎండలు ఉక్కపోత పుట్టిస్తున్నాయి. దీంతో మూగజీవాలు గ్రాసం, తాగునీటి కోసం తల్లడిల్లిపోతున్నాయి. పంట పొలాలు, కాలువ గట్టు వెంట మూగజీవాలు గ్రాసం కోసం పడుతున్న పాటు అంతాఇంతా కాదు. బావులు, బోర్ల దగ్గర మూగజీవాలు గ్రాసం మేసేందుకు వెళితే అక్కడ గ్రాసం దొరకడం లేదు. దీంతో మూగజీవాలు ఆకలి దప్పికలతో మూగరోదన చేస్తున్నాయి. పశువుల యజమానుల ఇళ్ల దగ్గర కూడా మూగజీవాలకు సరిపడ గ్రాసం, నీరు లభించడం లేదు. దీంతో పశువుల యజమాని పంట పొలాలకు వదులుతున్నారు. చాలమంది రైతులు గ్రాసం నీటి కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ గ్రాసం రూ.15 వేల నుంచి రూ. 18 వేల వరకు పలుకుతోంది. రాయచూరు, బళ్లారి, నందికొట్కూరు, ప్రాంతాల నుంచి పశువుల యజమానులు గ్రాసాన్ని దిగుమతి చేసుకుంటున్నారు.


నీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు

మఠం గోశాలకు పశుగ్రాసం విరాళం


గోశాలకు విరాళంగా తెచ్చిన పశుగ్రాసంతో ట్రాక్టర్లు

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు కర్ణాటకలోని భాగ్యనగర్ క్యాంపునకు చెందిన రైతులు 42 ట్రాక్టర్ల వరి, జొన్న పశుగ్రాసం విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. సోమవారం ఉదయం తమ సొంత ట్రాక్టర్లతో బయలు దేరి రాత్రి మంత్రాలయానికి చేరుకున్నారు. రూ. 6.30లక్షలు విలువ చేసే గ్రాసం విరాళం ఇచ్చిన రైతులు మధ్వమార్గ్ కారిడార్‌లో ఉంచి విరాళంగా తెచ్చిన గ్రాసానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూజలు చేసి రైతులను అభినందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మేనేజరు శ్రీపతిఆచార్, గోశాల సూపర్‌వైజర్ దేశాయ్ రాఘవేంద్రరావు, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్,వాజేంద్ర ఆచార్, శ్రీపాద ఆచార్,గిరిధర్ పాల్గొన్నారు.

కాత్రికిలో కర్ణాటక మద్యం అమ్మకాలు

కౌతాళం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాత్రికి గ్రామంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణం మందుబాబులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాఠశాల పని వేళలు ముగియగానే మందుబాబులు కర్ణాటక టెట్రా ప్యాకెట్లతో అక్కడికి చేరుకుని మద్యం తాగి ఖాళీ ప్యాకెట్లను అక్కడే పడేసిపోతున్నారు. ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు టెట్రా ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. ఎక్సైజ్ , పోలీస్ అధికారులు మండలంలో కర్ణాటక మద్యంను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పాఠశాల ఆవరణలో పడేసిన ఖాళీ కర్ణాటక మద్యం ప్యాకెట్లు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడపడచులను ఇళ్లకు రావడంతో సందడిగా కళకళలాడాయి.

ఘనంగా అల్లిసాహెబ్ స్వామి జియారత్


అల్లిసాహెబ్ స్వామికి జియారత్ నిర్వహిస్తున్న భక్తులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్ కైరవాడి గ్రామంలో వెలసిన అల్లిసాహెబ్ స్వామి జియారత్ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హెచ్ కైరవాడి గ్రామ స్థులే కాక కర్నూలు, బళ్లారి, మహబుబ్‌నగర్, ఆదోని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జియారత్ కార్యక్రమానికి హాజరయ్యారు. స్వామి వారి జీవసమాధిని గంధం నిర్వహించారు. వందలాది మంది భక్తులు తమ కొర్కెలను తీర్చాలని స్వామికి ఇష్టమైన ఇసుకను ఎద్దుల బండ్లు, ట్రాక్టర్‌లతో సమర్పించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

డ్రైనేజీ వ్యవస్థను సరి చేయండి

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్అండ్బీ గెస్టు హౌస్ మైదానంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, దీంతో భక్తులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సరిచేయాలని అఖిల భారత యువజన సమైఖ్య మండల కార్యదర్శి రాజు కోరారు. సోమవారం మఠం మేనేజర్ వెంకటేశ్ జోషికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మనోజ్, మురళి పాల్గొన్నారు.

నిజ బృందావనాన్ని దర్శించుకున్న భక్తులు

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు. సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే పూజలకు విరామం ఇచ్చారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు చేశారు. వేలాది మందిభక్తులు తరలివచ్చారు.

చెత్త తొలగింపు

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చమర్రి గ్రామంలో మూడు రోజుల క్రితం జరిగిన బంగారమ్మ గ్రామ దేవర ఉత్సవాలు ముగిశాయి. వేలాది మంది భక్తులు జాతరకు తరలిరావడంతో గ్రామమంతా చెత్తాచెదారం, మురికి కాలువలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అంటురోగాలు ప్రబలకుండా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు జడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మేకల సుజాత, ఎంపీటీసీలు మజ్జిగ నరసమ్మ, కోసిగి జయలక్ష్మి, దేవర కమిటీ నాయకులు జెట్టి నరసింహులు, యాగంటి వీరేష్, గొరైల హనుమంతు, చింతల కర్రెప్ప, బొజ్జప్ప, కడిచట్ల వెంకటేశ్, మాలింటి హనుమంతప్ప, అంజినయ్య ముక్కిడప్ప ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రెండు జేసీబీ యంత్రాలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ప్రధాన రోడ్ల వెంట ఉన్న చెత్తాచెదారాన్ని ఊరి బయటకు తరలించారు.


డ్రైనేజీని శుభ్రం చేస్తున్న కూలీలు